క్లుప్తంగా

టూరిజం సిబ్బందికి టోపీల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) బోటింగ్ సిబ్బందికి కాంట్రాక్టర్ మన్నం కొండయ్య టోపీలను వితరణ చేశారు. వేసవి కాలంలో బోటింగ్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన ఆదివారం భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లోని బోటింగ్ పాయింట్ వద్ద మేనేజర్ నాగరాజుకు టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. మండుటెండలో బోటింగ్ సిబ్బంది పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకుని ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ సూచనల మేరకు టోపీలను అందించామన్నారు. సామాజిక సేవలో భాగంగా బెరంపార్క్, భవానీ ద్వీపం సిబ్బందికి తన వంతు సేవలు అందిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా బోటింగ్ సిబ్బంది కొండయ్యకు ధన్యవాదాలు తెలియజేశారు.

రామలింగేశ్వర ఆలయంలో విశేష పూజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చైత్ర అమావాస్యను పురస్కరించుకొని భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, నాగ పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో రామలింగేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, ఏకాదశ రుద్రాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యాగశాలలో మండపారాధన, గణపతి పూజ, చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

ఉగ్రవాదుల దాడిని ఖండించిన జమ్‌యియ్యత్ అహ్లెహదీస్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్‌యియ్యత్ అహ్లెహదీస్ రాష్ట్ర కమిటీ కశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించింది. మృతులకు సంతాపం తెలిపింది. విజయవాడ నగరంలోని ఆ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఫజల్‌రెహ్మాన్, అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఉగ్రవాదాలు దుశ్చర్యలను తమ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉగ్రవాదానికి మతం ఉండదని ఉగ్రవాదులు పశువుల కన్నా హీనమైన వారని చెప్పారు. ఇస్లాంలో ఒక వ్యక్తిని చంపితే సమస్త మానవుల్ని చంపినట్లుగా ఉందన్నారు. అటువంటిది, ఈ దుర్మార్గపు చర్యకి పాల్గొనటం చాలా నీచమైన చర్యగా వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల మీద కఠినమైన చర్య తీసుకొని వారిని అంతమొందించాలన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి చర్య జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఫారుఖ్‌ఖాన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని కొత్తపేట హిందూహైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం(1996–1997) కన్వీనర్ శీరం నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ మృతుల ఆత్మశాంతిని కోరుతూ కోమలవిలాస్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రదాడులను ఖండిస్తూ యావత్ దేశం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, రాంప్రసాద్, మహాలక్ష్మి, విశాలి, నాగమణి, వెంకటేశ్వరరావు, పాండు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం వీఎంసీలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో, చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, స్థానిక అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

పశ్చిమలో మెరిసిన 'పది' విద్యార్థులు

- ఉత్తమ ఫలితాలు సాధించిన ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు
- గత ప్రభుత్వ కృషితో గాడినపడిన ప్రభుత్వ విద్యాసంస్థలు
- ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా మొదటి ర్యాంక్ పశ్చిమదే



విద్యాధరపురంలోని డీఎస్ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)



గాధంశెట్టి సాయి చరణ్(593)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ విద్యాసంస్థలు అత్యుత్తమ ఫలితాలను సాధించాయి. మున్సిపల్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఫలితాల్లో తమ సత్తా చాటి చెప్పారు. ఫలితాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో పాటుగా ఎయిడెడ్ పాలకవర్గాలు చూపించిన చొరవతో విద్యార్థులు జిల్లా స్థాయిలో ముందు వరుసలో నిలిచి తమ ప్రతిభను చాటి చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 18 వరకు మున్సిపల్, ఎయిడెడ్ ప్రభుత్వ రంగానికి చెందిన హైస్కూళ్లు ఉన్నాయి. దాదాపుగా అన్ని విద్యాసంస్థల్లోనూ విద్యార్థులు పదుల సంఖ్యలో వందకు వంద సాధించిన వారు ఉండటం విశేషం.

జిల్లా మొదటి ర్యాంక్.. తేలప్రోలు బాపనయ్య స్కూల్

పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ రంగ విద్యాసంస్థలకు సంబంధించి ప్రముఖ ఎయిడెడ్ విద్యాసంస్థ తేలప్రోలు బాపనయ్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన గాధంశెట్టి సాయి చరణ్ 593 మార్కులు సాధించాడు. ఇది జిల్లా ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో సాధించిన అత్యధిక మార్కులు. ఇదే విద్యాసంస్థకు చెందిన పిళ్లా ముకేష్ చంద్రసాయి, వందనపు జోషికా ఎస్ఎస్ మనశ్విత, అమరారపు దేశ్వికాలు 586 మార్కులు సాధించారు. అలాగే తుమ్మలచర్ల శ్రీ లక్ష్మి 585, షేక్ షఫీనా, శ్రీకాకుళపు బి.సాయిశ్రీలు 582 మార్కులు, భవన్ కౌవర్ చౌహాన్ 581 మార్కులు సాధించారు. వీరంతా ఒకే విద్యాసంస్థ నుంచి 580కు దాటి సాధించిన విద్యార్థులు కాగా ఈ విద్యాసంస్థ 78 మంది విద్యార్థులు హాజరైతే వంద శాతం ఫలితాలను సాధించారు. అలాగే తెలుగులో ముగ్గురు, మ్యాథ్స్‌లో ఇద్దరు, సైన్స్‌లో 12, సోషల్ స్టడీస్‌లో 11 మంది విద్యార్థులు వందకు వంద మార్కులు సాధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ స్కూళ్లు

పశ్చిమ నియోజకవర్గంలో ఎయిడెడ్, మున్సిపల్ ప్రభుత్వ రంగ హైస్కూళ్లు 18 ఉన్నాయి. అందులో సుమారు 14 విద్యాసంస్థల్లో 70 శాతానికి మించి ఫలితాలను సాధించాయి. మిగిలిన నాలుగు విద్యాసంస్థలు సైతం 60 శాతానికి పైగా ఫలితాలను సాధించాయి. అదేవిధంగా రాజస్థానీ హిందీ విద్యాలయం, తేలప్రోలు బాపనయ్య హైస్కూల్స్ వంద శాతం ఫలితాలను సాధించాయి. అలాగే ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్ సైతం 80 శాతం ఫలితాలను సాధించాయి. అదేవిధంగా భవానీపురంలోని ఎస్ఎంఏ ఖుద్దుస్ మున్సిపల్ హైస్కూల్ 94 శాతం ఫలితాలను సాధించాయి.

గత ప్రభుత్వ సంస్కరణలతో..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. దేశంలోనే అత్యధిక నిధులు ఖర్చు చేయటమే కాకుండా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఆ కృషి ఫలితంగానే ప్రభుత్వ విద్యాసంస్థలు మంచి ఫలితాలను సాధించి సత్తాను చాటి చెబుతున్నాయని పలువురు విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తీసుకొచ్చిన సంస్కరణలను పక్కదోవ పట్టించటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని సరిదిద్దుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

మతోన్మాద ఉగ్రవాదంపై శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న అష్టాక్షరి జీయర్ స్వామీజీ, యోగసాధకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జమ్ముకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై మతోన్మాద ఉగ్రవాదులు పాల్పడిన మారణకాండకు వ్యతిరేకంగా యోగ సాధకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం(మంగళగిరి) ప్రధాన యోగాచార్యులు డాక్టర్ వెంకటేశ్వర యోగి గురువు సూచనల మేరకు గొల్లపూడిలోని అనిల్ క్యాజిల్స్ అపార్ట్‌మెంట్స్ నుంచి బయలుదేరిన ర్యాలీ జాతీయ రహదారిపై వై.జంక్షన్, వన్ సెంటర్ మీదుగా తిరిగి అనిల్ క్యాజిల్స్‌కు చేరుకుంది. సంస్థ భవానీపురం శాఖ(2) ఆధ్వర్యంలో మంజుల యోగి మాతాజీ, వేమన యోగి గురువు పర్యవేక్షణలో నిర్వహించిన శాంతి ర్యాలీలో అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామి, శ్రీవెంకటేశ్వర యోగి సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు యథాశక్తి యోగి, విజయవాడ వివిధ శాఖల గురువులు, భవానీపురం శాఖ అధ్యక్షుడు నంది యోగి(రమేష్‌బాబు), జనరల్ సెక్రటరీ ప్రాప్తి యోగి, కమిటీ సభ్యులు రవి నయన యోగి, విశ్వ సాయి యోగి, యోగ సాధకులు పాల్గొన్నారు. మతోన్మాదం.. తీవ్రవాదం నశించాలి, భారతీయ ధర్మం వర్ధిల్లాలి అంటూ నినదించారు. ఈ సందర్భంగా అష్టాక్షరీ జీయర్ స్వామి మాట్లాడుతూ శాంతి విధానంలో మన్ననలు పొందిన 140 కోట్ల భారతీయులు ఉగ్రవాదుల హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. శాంతి పరిరక్షణకు ప్రతి పౌరుడు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ వెంకటేశ్వర యోగి గురూజీ పంపిన సందేశంలో మానవతా విలువలు లేని మతోన్మాద ఉగ్రవాదాన్ని కులమతాలకు అతీతంగా భారతీయులందరూ వ్యతిరేకించటం హర్షణీయమని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజ



కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్‌లు ముందంజలో ఉన్నాయని రోటరీ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సభ్యుల సమావేశంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం కైలాస వైకుంఠ వాహనాన్ని(మహాప్రస్థానం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టడాన్ని ఎంత ఆనందంగా జరుపుకుంటామో, అంతిమయాత్ర కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా జరుపుకోవాలని అనుకుంటారన్నారు. అందుకోసం రోటరీ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో వాహనాన్ని ప్రారంభించామన్నారు. రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. అనంతరం మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిశోర్ మాట్లాడుతూ.. తుమ్మలపల్లి కళాక్షేత్రం పక్కన ఉన్న వీరబాబు దేవస్థానానికి రూ.2 లక్షల విలువ చేసే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కైలాస వైకుంఠ వాహనాన్ని చార్టెడ్ అకౌంట్ గద్దం రవి, ఆయన తండ్రి గద్దం సుబ్బారావు జ్ఞాపకార్థం కొంత మొత్తం, క్లబ్ ఆధ్వర్యంలో మిగిలిన సొమ్ముతో వాహనం కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సుందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, డిస్ట్రిక్ అడ్వైజర్ యడ్ల పార్థసారథి, గద్దం రవికుమార్, క్లబ్ ప్రతినిధులు మధు కోనేరు, తొండేపు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ఉద్యాన సహాయకులకు వెసులుబాటు కల్పించాలి

ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడ): గ్రామ ఉద్యాన సహాయకులను సచివాలయం శాఖలో పనిచేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణోతు నాగరాజు కోరారు. గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ గ్రామ ఉద్యాన సహాయకులకు జాబ్‌చార్ట్ ప్రకారం మాత్రమే విధులు నిర్వహించేలా చూడాలని అన్నారు. గ్రామ ఉద్యాన సహాయకులను ఉద్యాన పంటల విస్తీర్ణం ప్రతిపాదికన ఉద్యాన అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహించే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఆరు సంవత్సరాలుగా ఉద్యాన సహాయకులకు బదిలీలు, ప్రమోషన్‌లు ఇవ్వకుండా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విధుల్లో వెసులుబాటు కల్పించి గ్రామ ఉద్యాన సహాయకులకు ప్రమోషన్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. గతంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు అందజేసినప్పటికీ వారి నుంచి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘాల జేఏసీ జనరల్ సెక్రటరీ సురేంద్ర, ఉపాధ్యక్షుడు మురళీ చంద్రయ్య, కోశాధికారి ఆంజనేయులు, ఉద్యాన సహాయకులు దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం, దీక్ష, షమీమ్, భరత్, మనోజ్ పాల్గొన్నారు.

మార్పు కావాలంటే నేర్పు, ఓర్పు, చేర్పు ఉండాలి

లైఫ్ ఆఫ్ కర్మయోగి పుస్తకావిష్కరణలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోపాలకృష్ణ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జీవితంలో మార్పు రావాలని కోరుకుంటే సరిపోదని అందుకు నేర్పు, ఓర్పుతో పాటుగా కొత్త అంశాలనే చేర్పు (చేర్చుకోవడం) కావాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ చెప్పారు. శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో లైఫ్ ఆఫ్ కర్మయోగి (ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. గోపాలకృష్ణ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సివిల్ సర్వెంట్స్ ఎలా ఉండాలనే విషయాలను ఈ పుస్తకంలో చక్కగా రాశానన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు పది సూత్రాలను ఇందులో పొందుపరిచామని, వీటిని పాటించడం ద్వారా తప్పకుండా ఐఏఎస్‌కు ఎంపిక అవుతారని చెప్పారు. చాలా మంది ఇంటర్వ్యూ వరకు వచ్చి అక్కడ వెనకడుగు వేస్తున్నారని, ఇంటర్వ్యూలో కూడా ఏవిధంగా విజయం సాధించాలో తాను విపులంగా ఈ పుస్తకంలో తెలియజేశానన్నారు. శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు చదవడం ద్వారా సివిల్ సర్వెంట్స్ జీవిత శైలిపై అవగాహన ఏర్పడుతుందన్నారు. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. యువత అడిగిన పలు ప్రశ్నలకు గోపాలకృష్ణ సమాధానమిచ్చారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై నృత్య కళాకారిణి నేతి రిషిత పర్యవేక్షణలో 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యోత్సవం



విజయవాడకల్చరల్: అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నాట్యాచార్యులు, చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు నేత్రపర్వంగా సాగాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గోనుగుంట్ల శైలశ్రీ నృత్యనిలయం, పద్మశ్రీ హేమంత్ భారతీయ నృత్యనిలయం, డాక్టర్ ఉషా మాధవి సిరిమువ్వ నృత్యనికేతన్, డాక్టర్ సీహెచ్ అజయ్‌కుమార్ హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, సంతోష్ శ్రీ శారదా నృత్యపీఠం, యల్లాజోస్యుల అనూరాధ శారదా నృత్యనిలయం, యువ నాట్యకళాకారులు ఎం.లేఖ్యాభరణి, సి.సిరి శృతి సమన్విలు తమ బృందాలతో 70 మంది కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నాట్యాచార్యులు వేదాంతం పాండురంగశర్మ, గోనుగుంట్ల సత్యానందినిలను ఆత్మీయంగా సత్కరించారు.

దేశ గౌరవాన్ని చాటిచెబుతున్న నృత్యాలు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాట్యాచార్యులు సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఒడిస్సీ నృత్యాలు మన దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దృశ్యవేదిక సభ్యులు హెచ్‌వీఆర్ ప్రసాద్, దొంతాల ప్రకాష్, నరేన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బత్తుల రూపాశ్రీ నిర్వహించారు.

బాల్యం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంపొందించాలి



గ్రంథాలయ విజ్ఞానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాల్యం నుంచే పిల్లలు, విద్యార్థులకు చదువు, భాష, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించాలని, గ్రంథాలయాలకు వెళ్లే విధంగా కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇటీవల కాలంలో పట్టణాల్లో కంటే గ్రామాల్లో గ్రంథాలయాలు ఎక్కువ మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో త్వరలో చారిత్రక గ్రంథాలయ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విజ్ఞానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆనాటి ప్రముఖులు గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపారని, కానీ నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం నడపాల్సి వచ్చిందన్నారు. మాతృ భాషా వికాసం కోసం ఈ వేదిక కృషి చేయాలని, ప్రజలను గ్రంథాలయాలు, పుస్తక పఠనం వైపు నడపాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రంథాలయాల కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి..

వేదిక అధ్యక్షుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం మొదలైన విజయవాడ కేంద్రంగా పునర్వికాస ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమస్యలపై ప్రభుత్వానికి వినతి ఇవ్వడం, పరిష్కారానికి వత్తిడి చేయడం, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, మేధావులను సమీకరించి ముందుకు సాగుతామని వివరించారు. కర్ణాటక, కేరళ, అమెరికాలో మాదిరిగా మన రాష్ట్రంలో గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణులు రావి శారద, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మినారాయణ, పాపినేని శివశంకర్, వెన్నా వల్లభరావు, దాసరి వెంకట రమణ,పి.సత్యవతి, మధురాంతకం రాజారామ్ మాట్లాడారు. సదస్సులో భాగంగా విద్యాసంస్థలు – గ్రంథాలయాలు, సాంకేతికయుగం – పుస్తకపఠన ఆవశ్యకత, జిల్లా గ్రంథాలయాలు – సమస్యలు – పునర్నిర్మాణం, పౌర గ్రంథాలయాలు – సాహిత్యం – ప్రాధాన్యత అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యమ వేదిక నిర్వాహకులు లక్ష్మయ్య, వెంకట నారాయణ, మనోహర్ నాయుడు, జి.లక్ష్మి, కాట్రగడ్డ, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

పాదచారుల దాహార్తిని తీర్చడం అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ కుమార్, జగన్‌మోహన్‌రావు



మజ్జిగ పంపిణీ చేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవీ క్లబ్ భవానీపురం గోల్డ్ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీ అప్నా బజార్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ ఆదివారం పాల్గొన్నారు. ప్రముఖ చిత్రకారుడు, స్థానికుడు డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు తమ సామాజిక సేవలో భాగంగా ఈ రోజు మజ్జిగను స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ చలివేంద్రంలో వెత్స రామారావు, పేరూరి సావిత్రి రామ్ నేతృత్వంలో 20 రోజులుగా 1500 మందికి చల్లటి మజ్జిగ అందజేయడం ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ఆర్సీ సురేష్ కుమార్, పెండేల సుహరిత, గజవల్లి ఆదినారాయణ, మల్లేశ్వరరావు, జెడ్సీ జక్కా సౌజన్య, గర్రె ప్రసాద్, అల్లం పూర్ణచంద్రరావు, ఆర్టిస్ట్ పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లు ఫౌండేషన్ మజ్జిగ వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం సితార జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా వేసవి కాలం పాటు ప్రతి ఆదివారం నగరంలోని ఒక ప్రధాన కూడలిలో తమ ఫౌండేషన్ ద్వారా దాహార్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ఆలోచనతో తాము చేసే మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నామన్నారు. ఫౌండేషన్ కార్యవర్గ సభ్యురాలు ఎం.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి వేసవిలో పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సేవా కార్యక్రమానికి కొందరు దాతలు ముందుకువచ్చి సహకరిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్, సీనియర్ సభ్యులు బాలసూర్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్‌కే మహమ్మద్ రఫీ, సభ్యులు ఎంవీఎస్ఎస్ ప్రసాద్, షేక్ హబీబ్ బాషా, గురురాజ్, పి.త్రినాథ్, నజీర్ మొహమ్మద్, కె.శ్రీనివాసరావు, ఎండీ ఇర్షాద్, కొమెర రాజు, చింతాడ శివ, శోభారాణి తదితరులు పాల్గొని తమ సేవలను అందజేశారు.

సకాలంలో గుర్తిస్తే కీళ్ల వ్యాధులు నయం



డాక్టర్ యోగితను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): కీళ్లలో నొప్పిని తగ్గించుకునేందుకు కేవలం పెయిన్ కిల్లర్ ట్యాబెట్లు మాత్రమే మార్గమని భావించకూడదని, 80 రకాల కీళ్ల సమస్యలు ఉంటాయని, సమస్య ఎక్కడని గుర్తించాలని ప్రముఖ డాక్టర్ చెన్నుపాటి యోగిత అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం పటమటలోని వాసవ్య మహిళా మండలి మండపంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీళ్ల వ్యాధులను త్వరగా గుర్తిస్తే అదుపుచేయటం సులువన్నారు. షుగర్, బీపీ థైరాయిడ్‌లతో బాధపడేవారికి వచ్చే కీళ్ల సమస్యలను కూడా తగ్గించుకోగలిగిన వైద్య సదుపాయాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కీళ్ల వ్యాధిని అశ్రద్ధ చేయరాదు..

కీళ్ల వ్యాధిని అశ్రద్ధ చేస్తే లంగ్స్, మూత్రపిండాలను ప్రభావితం చేస్తుందని, 20 – 40 ఏళ్ల మధ్య స్త్రీలలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని, ఇమ్యూనిటీ, కీళ్ల సమస్యల వల్ల జ్వరం కూడా వస్తుందన్నారు. కండరాల వాపు ఎన్నో సమస్యలకు కారణమవుతుందని, వయస్సు మీరిన వారికి సాధారణమని, అధిక బరువు కూడా కీళ్ల సమస్యలకు కారణమని తెలిపారు. ఈ సందర్భంగా సమభావన మిత్రమండలి వ్యవస్థాపకులు ఎంఎస్ స్వామి శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ యోగితను సన్మానించారు. కార్యక్రమంలో సమభావన మిత్రమండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, డాక్టర్ యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బీసీహెచ్ వెంకటరెడ్డి, డాక్టర్ ఎంవీరావు, డాక్టర్ పీఆర్కే ప్రసాద్, పేర్లి దాసు, వెల్లంకి నాగభూషణం, లలిత తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టింటి వద్ద ఉంటున్న భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు నానతాడు తీసుకెళ్లిన భర్తపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన మెట్టకాయల శ్రీదేవి, ఆమె భర్త రాంబాబు 25 సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ ఉడాకాలనీలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల రాంబాబు మానసిక స్థితి సరిగా లేక తరుచూ భార్యతో గొడవ పడటం, మానసికంగా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఈ నెల 26వ తేదీన రాంబాబు తన భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారపు నానతాడును తీసుకువెళ్లాడు. ఈ ఘటనపై శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆనందోత్సాహాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ టేనర్‌పేటలోని టేనర్ మెమోరియల్ ఉన్నత పాఠశాల 1987 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల కలయిక భవానీపురం స్వాతి రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. దాదాపు 38 సంవత్సరాల తరువాత వారంతా కలవటంతో గుర్తుకొస్తున్నాయి.. జ్ఞాపకాలు నిద్రలేస్తున్నాయి..అంటూ ఒక సినీ కవి రాసిన పాట గుర్తుకువచ్చింది. అంతే.. అప్పట్లో తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలు గుర్తుకు చేసుకున్నారు. ఉపాధ్యాయులు దండించిన ఘటనలను నెమరువేసుకుని నవ్వుకున్నారు. అప్పట్లో సరదాగా పెట్టుకున్న నిక్ నేమ్‌లతో పిలుచుకుని సందడి చేశారు. స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ నాటి స్నేహాన్ని మరింత శాశ్వతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తొలుత అపూర్వ కలయికను కేక్ కట్ చేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఎం.శివరాం ప్రసాద్, కేసీహెచ్ వెంకటేశ్వరరావు, ఏవీడీ ప్రసాద్, శ్రీనివాస్, అమీర్ నిర్వహించారు.